


### ఉమ్మడి జిల్లా వైఎస్సార్సీ అధ్యక్షుడిగా

# పెద్దిరెడ్డికి పగ్గాలు

**- పిఎసి సభ్యుడిగా బాధ్యతలు..**
**పార్టీకి జవసత్వాలు కల్పించేందుకేనా..?**



కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

గత వైఎస్సార్సీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చిత్తూరు జిల్లా, తిరుపతి జిల్లా (తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు) పార్టీ అధ్యక్షుడిగా నియమిస్తూ వైఎస్సార్సీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. అలాగే పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్సీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ(పిఎసి) సభ్యులుగా సైతం నియమించారు. కాగా అటు చిత్తూరు జిల్లా, ఇటు తిరుపతి జిల్లాల్లో గత ఎన్నికల్లో వైఎస్సార్సీ పార్టీకి ఘోరపరాజయం దక్కింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా ను ంచి వైఎస్సార్సీ తరపున పుంగనూరు నుంచి మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాత్రమే విజయం సాధించారు. చిత్తూరు జిల్లాలోని కుప్పం, పలమనేరు, చిత్తూరు, పూతలపట్టు, నగరి, జిడి నెల్లూరు, తిరుపతి జిల్లాలో తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, చంద్రగిరి, సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఈ ఘోరపరాజయం మాజీ సిఎం జగన్‌ను సైతం ఆందోళనలోకి నెట్టేసిందంటే అతిశయోక్తి కాదు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి అనంతరం వైఎస్సార్సీ కార్యకర్తలు నిస్తేజంలో కొనసాగుతున్నారు. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో సామాన్య కార్యకర్తలను, నాయకులను పలు నియోజకవర్గాల్లో ఆ పార్టీ నేతలు పట్టించుకోకపోవడంతోనే పార్టీకి ఘోర పరాభవం సంభవించిందని నేటికీ వైఎస్సార్సీ కార్యకర్తలు, నేతలు బహిరంగంగా పేర్కొంటున్నారు. పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రధాన నాయకుల హవా కొనసాగిందే తప్ప పార్టీ కోసం కష్టించే వారికి సరైన గుర్తింపు లభించలేదని వాపోతున్నారు. పార్టీకి మేలు జరుగుతుందని భావించి తెచ్చిన వాలంటీర్ల వ్యవస్థ పార్టీ నేతలు, ప్రజల మధ్య సంబంధాలు దెబ్బతీసిందని పేర్కొంటున్నారు. కర్ణుడి చావుకు కోటి కారణాలు అన్నట్లు పార్టీ ఓటమికి అనేక కారణాలు ఉన్నాయని బాహాటంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికలకు పార్టీ కేడర్, కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు వైఎస్సార్సీ అధ్యక్షుడు వైఎస్ జగన్ చిత్తూరు, తిరుపతి జిల్లా పార్టీ పగ్గాలను మాజీ మంత్రి పెద్దిరెడ్డికి అప్పగించినట్లు స్పష్టమవుతోంది. 2024 ఎన్నికల్లో ఘోర పరాజయంతో నిస్తేజంలో ఉన్న పార్టీ శ్రేణుల్లో మరలా జవసత్వాలు కల్పించేందుకే జగన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా పార్టీలో ఉన్న నేతల మధ్య విబేధాలు, ఆధిపత్య పోరును మున్ముందు పెద్దిరెడ్డి ఎలా సర్దుబాటు చేస్తారో వేచి చూడాలి.ప్రధానంగా పార్టీ కార్యకర్తల్లో ఎలా ఉత్తేజం నింపుతారో చూడాలి.

**భరత్.. నేదురుమల్లిని తప్పించి:**

భరత్ చిత్తూరు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. పార్టీ అధినేత జగన్‌కు అత్యంత సన్నిహితుడైన భరత్‌కు ఈసారి అవకాశం దక్కలేదు. ఇక తిరుపతి జిల్లా వైఎస్సార్సీ అధ్యక్షుడిగా నేదురుమల్లి రా మ్‌కుమార్‌రెడ్డి పనిచేశారు. ఈయనను సైతం పార్టీ అధిష్టానం తప్పించింది. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లాలో వచ్చే గూడూరు, వెంకటగిరి, సూళ్లూరు పేట నియోజకవర్గాలు మినహాయించి మిగతా నాలుగు జిల్లాలు, చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజక వర్గాలకు కలిపి 11 నియోజకవర్గాలకు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి వ్యవహరించనున్నారు.

## వేదవిజ్ఞానపీఠంలో గణపతిప్రతిమ నేడు నిమజ్జనం

తిరుమల,సెప్టెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమల ధర్మగిరి వేదపాఠశాలలో గణపతినవరాత్రులు పూజాకైంకర్యాలు ఆదివారం ముగిశాయి. తొమ్మిదిరోజులు ప్రతి రోజూ వినాయకుడిని వేర్వేరు అలంకారలతో పలు రకాల వాహనాలపై వేంచేపు చేసి పూజించారు. తొలిరోజు వరసిద్ధివినాయకస్వామిగా కొలువుదీర్చి ప్రత్యేక పూజలు, నివేదనలు సమర్పించిన వేదవిద్యార్థులు, వేదపండితులు ,ఆదివారం సిద్ధిబుద్ధిగణపతిమూషికవాహనంపై అనుగ్రహించారు. ధర్మగిరి వేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కెఎస్ఎస్ అవధాని ఆధ్వర్యంలో వేదవిద్యార్థులు గణేశవిగ్రహాన్ని తయారుచేసి పూజలు చేశారు.



# కమనీయం 'వరసిద్ధుని' కళ్యాణం






**స్వామివారి కళ్యాణం సందర్భంగా మాంగల్యం చూపుతున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు**

కాణిపాకం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారికి తిరుకళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం, తిరువణంపల్లె వణిగ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు స్వామివారి తిరుకళ్యాణం నిర్వహించడానికి తల్లిదండ్రులైన శివపార్వతులు పగలు కాణిపాకం గ్రామ పురవీధుల్లో భిక్షాటన చేశారు. ఈసందర్భంగా అలంకృతులైన శివపార్వతులు మణికంఠేశ్వరాలయంలో అర్చకస్వాముల పూజలందుకున్న అనంతరం కాణిపాకం, కాకర్లవారిపల్లె గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ తమ పుత్రుడు వరసిద్ధుని తిరుకళ్యాణానికి భిక్షాటన చేశారు. అనంతరం రాత్రి ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసి, దేదీప్యమానంగా అలంకరించిన కళ్యాణ వేదికపై సిద్ధి, బుద్ధి, సమేత గణనాథుని ఉత్సవమూర్తులను వుంచి ఆలయ అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే నూతన వధూవరులైన సిద్ధి, బుద్ధి గణనాధులకు పుణ్యాహావాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం గావించి స్వామివారికి పాదపూజ చేశారు. అనంతరం అశేష భక్త జనం నడుమ స్వామివారిచే ఉభయదేవేరులకు మాంగల్యధారణ చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లు తలంబ్రాలు పోసుకునే కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈతిరుకళ్యాణాన్ని తిలకించిన అశేష భక్త జనం భక్తి పారవశ్యంతో పరవశించిపోయారు. అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురు ప్రసాద్, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు విఘ్నేష్, రవి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్,ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

### అశ్వవాహనంపై అలరించిన గణపయ్య

కాణిపాకం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి సిద్ధి,బుద్ధి సమేతుడైన గణనాథుడు అశ్వవాహనంపై అధిరోహించి కాణిపాకం పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. రాత్రి ఆలయంలో అంగరంగ వైభవంగా తిరుకళ్యాణం జరిగిన అనంతరం స్వామివారికి అశ్వవాహనసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకులపల్లె, కారకాంపల్లె, గ్రామాదుల గోనుగుంట బలిజవంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉభయదారులచే ఉదయం స్వామివారికి అష్టోత్తర శతకలశాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. అలాగే రాత్రి స్వామి అమ్మవార్లు సర్వాలంకృతులై అలంకార మండపంలో వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకస్వాముల పూజలందుకున్న అనంతరం రంగు రంగుల విద్యుద్దీపాలు, వివిధరకాల పుష్పాలతో దేదీప్యమానంగా అలంకరించిన అశ్వవాహనంపై అధిరోహించి మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా భక్తులు నారికేళ కర్పూర హారతులతో మొక్కులను తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు విఘ్నేష్, రవి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి,ఎంపీటీసీ సుధీర్,ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

### శ్రీవారి సేవలో ప్రముఖులు





తిరుమల,సెప్టెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:

కలియుగప్రత్యక్షదైవం శ్రీవారిని ఆదివారం ఉదయం ప్రముఖులు దర్శించుకున్నారు. విఐపి బ్రేక్‌లో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాష్ట్రసమాచారశాఖ డైరెక్టర్ హిమాన్షుశుక్ల, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు, జస్టిస్ కిరణ్మయి,సర్వేపల్లి రాధాకృష్ణ వంశీకులు డాక్టర్ సుబ్రమణ్యశర్మ స్వామివారి ఆశీస్సు లందుకున్నారు.

# స్కిట్ పూర్వ వైభవానికి ప్రభుత్వం చొరవ

**-వాస్తవ పరిస్థితి అధ్యయనానికి ప్రత్యేక కమిటి నియామకం**
**-ఈనెల 20లోపు నివేదిక ఇవ్వాలి-ఎంఎల్ఏ చొరవ అభినందనీయం**



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో మూత పడ్డ స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల మనుగడకు అనంతపురంలోని జెయన్‌టియుకు అప్పగించేందుకు నివేదికలను తయారు చేయుటకు ప్రత్యేక కమిటిని నియమిస్తూ ఉత్తర్వులు జారి చేసింది. నలుగురు సభ్యులతో కూడిన కమిటిని నియమిస్తూ జిఓ ఆర్‌టి నెంబర్ 140 తేది 14.09.2024లో ఉత్తర్వులు జారి చేసారు.శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి చొరవను పలువురు అభినందిస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా 1999లో ప్రారంభించిన స్కిట్‌ఇంజనీరింగ్ కళాశాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గత వైకాపా పాలనలో ప్రైవేటు నిర్వాహకులకు, జెయన్‌టియుకు అప్పగించాలనే పరిశీలనలే తప్ప ప్రభుత్వం నుంచి స్పందన లేదు.అయితే గతంలో శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఈ కళాశాలను అనంతపురంలోని జెయన్‌టియుకు అప్పగించుటకు ప్రభుత్వం ద్వారా ప్రయత్నించారు. కానీ జెయన్‌టియు వారు ఆస్తులను 99 సంవత్సరాల లీజుకు ఇవ్వాలని, అలాగే ప్రస్తుతం ఉన్న సిబ్బంది అవసరం లేదంటూ నిబంధనలు పెట్టడంతో ఈ ప్రతిపాదన మరుగున పడింది. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానంకు సంబంధించిన ఆస్తులను గత పాలకులు ప్రైవేటు వ్యక్తులకు 99 సంవత్సరాల లీజుకు కట్టబెట్టారు.కానీ ఎందుకో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్కిట్ కళాశాలకు సంబంధించి ప్రభుత్వ స్థాయిలో ఫైళ్ళను కదలించలేక పోయారు. ప్రస్తుత శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి తన తండ్రి ఆశయ సాధనకు స్కిట్ కళాశాల మనుగడ కోసం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.వెంటనే ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఈ కళాశాల ఫైళ్ళను పరిశీలించిన ప్రభుత్వం నలుగురు సభ్యులతో కూడిన కమిటిని నియమించారు.ఈ కమిటి ఛైర్మెన్‌గా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ వైస్ ఛైర్మెన్ నియమించారు. కార్యదర్శిని కన్వీనర్‌గా దేవాదాయశాఖ కమిషనర్, అనంత జెయన్‌టియు రిజిస్ట్రార్ సభ్యులుగా నియమించారు.సమగ్ర నివేదికలను ఈ నెల 20లోపల ప్రభుత్వానికి సమర్పించాలని సత్వర చర్యలు తీసుకొనుటకు సహకరించాలని ప్రభుత్వం ఆదేశించారు.

## బ్రహ్మోత్సవాలు చూతము రారండీ!

**-శంఖుచక్రనామాలతో మహద్వారగోపురం అలంకరణ**



తిరుమల,సెప్టెంబర్ 15 ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామిసాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు సపరివారదేవతలనేగాక కోట్లాదిమంది భక్తులను ఆహ్వానిస్తూ తిరుమల స్వాగతంపలకనుంది. ఇందుకోసం ఇప్పటికే సప్తగిరులు రకరకాల స్వాగత తోరణాలతో, ఆర్చిలతో, విద్యుద్దీప కటౌట్లతో సిద్ధమవుతోంది. టిటిడి విద్యుత్‌విభాగం సిబ్బంది తిరుమల స్వామీవారి ఆలయ మహద్వారగోపురంపై భాగాన శంఖు,చక్రనామాలతో విద్యుద్దీపాలను కటౌట్లుగా ఏర్పాటుచేశారు. ఇందుకోసం సిబ్బంది అత్యంత భక్తిశ్రద్ధలతో నీ గుడి అలంకరణ ముస్తాబు చేస్తున్నాం....మమ్మల్ని కరుణించు స్వామి అని వేడుకుని అలంకరణలు చేయడం విశేషం.

## బొలోరో ఢీకొని వ్యక్తి మృతి

**వాహనంలో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలు**





**ప్రమాదంలో మృతిచెందిన సుబ్రమణ్యం, అదుపుతప్పి బోల్తాపడిన బొలెరోవాహనం**

పెద్దపంజాణి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :

మండలంలోని దాసినంపల్లి సమీపంలోని దీపికాఫ్లోట్రీఫారం సమీపంలోని ఓ బొలెరోపిక్అప్‌వాహనం కిందపడి ద్విచక్రవాహనంలో వస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు కథనం మేరకు వివరాలిలా..మండలంలోని మారప్పల్లి గ్రామంకు చెందిన కొంతమంది ఆదివారం బైరెడ్డిపల్లి మండలం కొలమాసనపల్లి సమీపంలోని గుండ్లపల్లెలో ఓ చావుకు బొలెరోపిక్‌అప్ వాహనంలోవెళ్ళి తిరిగివస్తుండగా చౌడేపల్లి- పలమనేరు రహదారి మార్గంమధ్యంలో దాసినంపల్లి సమీపంలోని దీపికాఫ్లోట్రీఫారం ముందు ఉన్న మలుపువద్ద అదుపుతప్పింది. ఈ క్రమంలో మండలంలోని కూరగాయలకొత్తపల్లి అత్తగారిఇంటి నుండి బయలుదేరి స్వగ్రామం బైరెడ్డిపల్లి మండలం ధర్మపురిఅగ్రహారం వెళుతున్న ఎల్లప్ప కుమారుడు సుబ్రమణ్యం(50) ద్విచక్రవాహనంలో వస్తుండగా ఊహించినిరీతిలో అదుపుతప్పి వాహనం కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. వాహనంలో ఉన్న పలువురికి సైతం తీవ్రగాయాలు కాగా, వారిని చికిత్సనిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలం చేరుకున్న పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పలమనేరు ప్రభుత్వాసుపత్రి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు.

### వినాయక నిమజ్జనానికి వెళ్లి

## తిరిగి వస్తున్న ట్రాక్టర్ బోల్తా

### ఆరు మందికి గాయాలు





**చిల్లకూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త**

మండల పరిధిలోని కడివేడు గ్రామ సమీపంలో ఆదివారం చెన్నూరు గ్రామంలోని రామలింగయ్య గిరిజన కాలనీకి చెందిన భక్తులు తూపిలిపాలెం గ్రామంలో ఉన్న సముద్రంలో వినాయక నిమర్జనికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వాహనం తప్పించిపోయి అదుపుతప్పి పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు అయిన ట్రాక్టర్ ముదినేని రవితో పాటు కరణం రవణమ్మ తుపాకుల పరిమళ, కరణం శివ వడమంచి వెంకటరమణయ్య, యాటగిరి సునీతలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారికి చికిత్స నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యాలయంకు తరలించి చికిత్స అందిస్తున్నారు. చిల్లకూరు ఎస్ఐ సురేష్ బాబు కేసు నమోదు చేసి ప్రమాదాలకు గల కారణాలను తెలుసుకుంటున్నారు.

## బావిలో పడి బాలుడు మృతి

కుప్పంరూరల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త



ప్రమాదవశాత్తు ఓ బాలుడు బావిలో పడి మృతి చెందిన సంఘటన మున్సిపల్ పరిధి గుండ్లపల్లిలో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన శివశంకర్ కుమారుడు శేఖర్ (11)శనివారం నాడు వినాయక విగ్రహాల నిమజ్జనంకు వెళ్లి వచ్చి గ్రామంలో సైకిల్ తొక్కుకుని ఉండేవాడని తెలిపారు. అయితే ప్రమాదవశాత్తు ఇతను గ్రామ సమీపంలోని బావిలో పడిపోయినట్లు కుటుంబీకులు, స్థానికులు గుర్తించి కుప్పం పోలీసులకు సమాచారం అందించారు. అర్బన్ సిఐ జిటి నాయుడు సూచనల మేరకు ఫైర్ అధికారి ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో ఫైర్ సిబ్బంది ఆదివారం ఉదయం బావిలో గాలించి శేఖర్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని పంచనామాకు తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వెలుగులో అవినీతి చీకట్లు- రూ.1.70కోట్లు నగదు స్వాహా

**.ఆలస్యంగా వెలుగులోకి....**
**- ఇద్దరు సంఘమిత్రలు సస్పెండ్**



తొట్టంబేడు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

వెలుగు సంస్థలో పనిచేస్తున్న సిబ్బందిని నమ్మి సొమ్మును జమచేసిన సంఘ సభ్యులు లబోదిబోమంటున్నారు. తమ సొమ్ముకు భద్రత ఉంటుందని భావించిన అమాయకులకు వేదనే మిగిలింది. ఇద్దరు సంఘమిత్రలు రూ.1.70కోట్లు దిగమింగి ఇంటిదారి పట్టగా కాయకష్టం చేసి పైసా పైసా మిగలబెట్టుకున్న లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే మండలంలోని చియ్యవరం గ్రామంలో ఇద్దరు సంఘమిత్రలు ఉన్నాయి. వీరిలో ఒకరు మునిలక్ష్మి, మరొకరు మునిశేఖర్, సిసిగా రేవతి విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో మొత్తం 56 గ్రూపులు ఉండగా 700మంది సభ్యులు ఉన్నారు. మహిళలు ఆర్థికస్వావలంభన సాధించాలన్న దిశగా ప్రభుత్వం వెలుగు సంస్థను ఏర్పాటు చేసి మహిళా గ్రూపులుగా ఏర్పాటుచేసి ఒక్కొక్క గ్రూపులో 10 నుంచి 12మంది మహిళలు వరకు ఉంటారు. వీరికి ప్రభుత్వం నుంచి ఒక్కొక్క గ్రూపుకు నిధులు మంజూరు చేస్తుంది. ఈనిధులను గ్రూపు సభ్యులు సమానంగా పంచుకోవడంతో పాటు బ్యాంకుకు సకాలంలో చెల్లించాల్సిన అవసరం ఉంది. ఇలా మండలంలో 1052 మహిళా సంఘాల ఉండగా 10496మంది సభ్యులు ఉన్నారు. చియ్యవరం గ్రామంలో ఉన్న సంఘమిత్రలు తమ చేతివాటాన్ని ప్రదర్శించి ప్రజల నమ్మకాన్ని గ్రామానికి చేరుకుని నగదు చెల్లించాలని మహిళా సంఘసభ్యులను కోరగా వారు తాము సంఘమిత్రలకు చెల్లించామని చెప్పడంతో ఎపిఎం, అధికారులు అవాక్కయ్యారు. అంతేకాకుండా సిసి రేవతి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ తతంగం అంతా సాగుతోందని తెలిసిపోయింది. ఆదివారం మహిళా సంఘాల సభ్యులతో సమావేశాన్ని నిర్వహించిన ఎపిఎం మాట్లాడుతూ తీసుకున్న నగదు చెల్లించాలని కోరగా మహిళలు తిరగబడ్డారు. దీంతో సంఘమిత్రలను ప్రశ్నించగా వారు చేసిన తప్పును ఒప్పుకోవడంతో వారిని సస్పెండ్ చేసి స్వాహాచేసిన నగదును వెంటనే చెల్లించకపోతే పోలీసులకు పిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మహిళలు ఆర్థికంగా ఎదగడం కోసం ప్రభుత్వం బ్యాంకు లింకేజీల ద్వారా ఆర్థిక సంవత్సరంలో రూ.30కోట్లు నిధులు మంజూరు చేసి మండలంలోని సంఘాలకు పంపిణీచేస్తుంది. సీనియర్ సంఘాలకు రూ.10 నుంచి 15లక్షల వరకు రుణసాయంను బ్యాంకర్లు మంజూరు చేస్తారు. చియ్యవరంలో ఇద్దరు విఓలు కూడా ఉన్నట్లు ఏపిఎం తెలిపారు. అయితే ప్రతినెలా ప్రజల వద్ద నుంచి తీసుకున్న నగదును బ్యాంకుకు జమచేయకుండా సంఘమిత్రలు ఇద్దరు వారివారి పాసుపుస్తకాల్లో వారే కట్టేసినట్లు నమోదు చేయడం మినిట్స్ పుస్తకంలో సంతకాలు పెట్టడం గుర్తించినట్లు ఎపిఎం తెలిపారు.

**సంఘమిత్రలను సస్పెండ్‌చేశాం : ఎపిఎం**

అవినీతి, అక్రమాలకు పాల్పడిన సంఘమిత్రలను సస్పెండ్ చేశామని ఎపిఎం గురుమూర్తి తెలిపారు. స్వాహాచేసిన నగదును తిరిగి చెల్లిస్తామని తెలిపారని వివరించారు. అయితే అవినీతికి పాల్పడిన సంఘమిత్రలను, సమాచారం అందించని సిసఇ రేవతిలను విధుల్లో నుంచి పూర్తిగా తొలగించాలని పలువురు మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు.

## ఆక్రమణదారులకు వక్ఫ్ నోటీసులు

**చిత్తూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:**

చిత్తూరు నడిబొడ్డున ఆక్రమణలో వున్న వక్ఫ్ భూముల ఆక్రమణదారులపై ఎందుకు చర్యలు తీసుకో కూడదో సమాధానం ఇవ్వాలని ఏపి రాష్ట్ర వక్ఫ్‌బోర్డు నోటీసులు జారీ చేసింది. చిత్తూరు హైరోడ్డు మండీ వీధి పరిసరాల్లో వక్ఫ్ బోర్డుకు సంబంధించి సర్వే నెం.602/1ఎలో 6.31 ఎకరాల వక్ఫ్ భూమి వుంది. ఈ భూమిని దీర్ఘకాలంగా ఆక్రమణదారులు ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నారు. వీటిపై స్పం దించిన వక్ఫ్‌బోర్డు వక్ఫ్ యాక్ట్ 1994, సెక్షన్ 54(1') కింద ఆక్రమణదారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

## నేడు పోలీస్ గ్రీవెన్స్ రద్దు

**చిత్తూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:**

మిలాడినబీ పండుగ సందర్భంగా జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను రద్దు చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలెవ్వరు సమస్యలు తీసుకుని సోమవారం పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావద్దని ఎస్పీ ఓ ప్రకటనలో తెలిపారు.

## వైభవంగా వినాయకుని నిమజ్జనం

**గుడిపాల, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని చెరువుముందరూరు జర్నలిస్టు కాలనీలో ఆదివారం వినాయక నిమజ్జనం కార్యక్రమం ను వైభవంగా నిర్వహించారు. ఇక్కడ శుక్రవారం వినాయకుడిని ప్రతిష్టించి ఆదివారం ఊరేగింపుగా నిర్వాహకులు నిమజ్జనంను నిర్వహించి పూర్తి చేశారు. ఈ సందర్భంగా వంద మంది నిరుపేదలకు నిర్వా హకులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సుమతి మురళీ, స్థానిక యువ త, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## సమాజ సేవ కోసమే చిత్తూరులో విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు

– ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు



**చిత్తూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:**

వ్యాపార ధృకృథంలో కాకుండా సమాజ సేవ చేయ దానికే చిత్తూరు నగరంలో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకును ఏర్పాటు చేసినట్లు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. చిత్తూరు కొంగారెడ్డిపల్లిలో ఆదివారం సిటిజన్ కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ రంగరాజులు విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ మాట్లాడుతూ సామాన్య ప్రజల స్థితిగతులను మెరుగుపరచాలనే సంకల్పంతో తమ బ్యాంకు పని చేస్తోందన్నారు. చిత్తూరు నగర ప్రజలకు మెరుగైన బ్యాంకు సేవలు అందించాలనే లక్ష్యంతో 53వ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు 1916 సంవత్సరంలో విశాఖపట్నం కేంద్రంగా ప్రారంభమైందని, ఇది అంచెలంచెలుగా విస్తరించి మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలను మినహాయించి సహకార టౌన్ బ్యాంకుల్లో అతిపెద్ద సహకార అర్బన్ బ్యాంకుగా గుర్తింపు పొందిందన్నారు. సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి చిత్తూరు నగరంలో తమ శాఖను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రానున్న మూడు సంవత్సరాల్లో చిత్తూరు బ్యాంకు శాఖ నుండి వంద కోట్ల రూపాయల రుణంను ప్రజలకు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ బ్యాంకు ఛైర్మన్ ఆంజనేయులు, నెల్లూరు ఛైర్మన్ నాగేంద్రసాయి, సిటిజన్ కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ రంగ రాజు, కోయిలగుంట్ల కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ శ్రీనివాస్, సిఇఓ వరలక్ష్మి, జోనల్ మేనేజర్ శ్రీని వాసరావు.బ్యాంకుమేనేజర్‌రామ్‌గణేష్,సిపిఐజిల్లాకార్యదర్శినాగరాజు ఖాతాదారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేచే నూతన పెట్రోల్ బంకు ప్రారంభోత్సవం



**గంగవరం,సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :**

మాజీ మంత్రి, పలమనేరు ఎమ్మె ల్యే అమర నాథరెడ్డి ఆదివారం ఉద యం నూతనంగా నిర్మించిన పెట్రోల్ బంకును ప్రారంభించారు. మండలం లోని బెంగళూరు,చెన్నై జాతీయ రహదారి పక్కన,జర్నలిస్టుల కాలనీ సమీపం లో పలమనేరు పట్టణానికి చెందిన కల్పన ఎక్ట్రికల్స్ అధినేత కల్పన నారాయణస్వామి నూతనంగా నిర్మించిన వినాయక పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఏదైనా వ్యాపారంలో అబివృద్ధి చెందాలంటే నమ్మకం ఎంతో విలువైం దని,కావున నాణ్యత ప్రమాణాల్లో,తూనికల్లో తేడాలు ఉండకూడదని బంకు యజమానులకు సూచించారు. మండలాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడు,ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బంకు యజమాని ఇదేష్,దేశం నాయకులు ప్రసాద్‌నాయుడు,కిరణ్‌కుమార్, సురేష్‌చౌదరి పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనం

**కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**



వినాయక చవితి సందర్భంగా కుప్పంలో ప్రతిష్టించిన పలు వినాయక విగ్రహాలకు ఆదివారం ఘనంగా నిమ జ్జనం చేశారు. కుప్పం ప్యాలస్ సర్కిల్‌లో శ్రీ మంజు నాథ సేవా సంఘం అధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాశక్తి గణపతి విగ్రహాన్ని పట్టణంలో భారీ ఎత్తున టపాకాయల హోరు, డప్పువాద్యాల నడమ ఊరేగిం చారు. సంఘం సభ్యులు ఉత్సాహంగా నృత్యాలు చేసి అలరించారు. అలాగే పట్టణంలోని వివిధ ప్రాం తాల్లో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను యువత పెద్ద ఎత్తున ఊరేగిస్తూ నిమజ్జనంకు తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భద్రత చర్యలు చేపట్టారు.

## భావితరాలకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శం



కెఇసి వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్

**కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**

భావితరాలకు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శంగా నిలిచారని కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ పేర్కొన్నారు. ఆదివారం కళాశాలలో జాతీయ ఇంజనీర్ల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరుగా భారతదేశ ఖ్యాతిని ప్రపంచ నలు దిక్కులకు చాటిన మేధావి మోక్షగుండం అని పేర్కొన్నారు. ఆయన అధ్వర్యంలో నిర్మించిన కెఆర్ సాగర్ ఆనకట్ట, బృందావన్ గార్డెన్, భద్రావతి ఉక్కు కర్మాగారం, హైదరాబాద్‌లో వరద నీటి రక్షణ వ్యవస్థ, ఆసియాలోనే మొదటి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్, మైసూరు సోపుల ఫ్యాక్టరీ బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూరు భవనాలు ఆయన కృషికి నిదర్శనాలని పేర్కొన్నారు. అంతకుముందు మోక్షగుండం చిత్రపటానికి పూజలు జరిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పిఒ గంగాధరన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విజయవాడలో కుప్పం తెదేపా నేతలచే నిత్యావసర వస్తువులు పంపిణీ

**కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విజయ వాడ నగరంలో ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యే బోండా ఉమామ హేశ్వరరావు, తెదేపా ఇన్‌ఛార్జ్ పిఎస్ మునిరత్నంల నేతృత్వంలో కుప్పం తెదేపా నేతలు వరద బాధితు లకు నిత్యావసర వస్తువులు పంపిణీ కొనసాగి స్తున్నారు. ఆదివారం విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లో వరద బాధితులకు రూ 1500ల విలువ చేసే నిత్యావసర వస్తువులైన దుప్పట్లు, టవళ్లు, ప్లేట్లు, గ్లాసులు, సోపులు, బకెట్లు, ఇతర అవసరమైన సామగ్రిని కిట్ల రూపంలో పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కుప్పం మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, రాష్ట్ర నేత గోపీనాథ్, కౌన్సిలర్ సోమశేఖర్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్,మాజీ గంగమ్మగుడి ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర, తెలుగుమహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు అనసూయ, మహిళా నేతలు స్వాతి రాజగోపాల్, సుగుణమ్మ, వసంతమ్మ, నేతలు పార్థసారథి, దామోదర్, శివకుమార్, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకై 2.75లక్షల విరాళం

**శాంతిపురం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**



విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలం లోని సొన్నేగానిపల్లి పంచాయతీ తెదేపా నేతలు, కార్యకర్తలు ముందుకు వచ్చారు. 2.25లక్షలవిరాళాన్ని మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడుకు అందజేశారు. అలాగే అనికెర పంచాయతీనుంచి ఇరవై వేల రూపాయలు అందించారు. కార్యక్రమంలో నేతలు నాగరాజు, మంజునాథరెడ్డి, బాలు, మునేగౌడు, వేదశ్రీ, ఉమాపతి, శివానంద, శంకర, కృష్ణమూర్తి.సోమారెడ్డి పాల్గొన్నారు.

## వరద బాధితులకు విరాళాల సేకరణ

**రామకుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**



మండలంలోని ఉన్సిగానిపల్లి పంచాయతీలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం తెదేపా నేతలు విరాళాలు సేకరించారు. ఉన్సిగానిపల్లి, గోవిందపల్లి, ఆనిగానూరులో రూ 1,10116లు విరాళాలను సిఎంఆర్ఎఫ్‌కు అందించనున్నట్లు తెలిపారు. దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో నేతలు రామూర్తి,జయశంకర్, శంకరాచలం పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## రవిచంద్రారెడ్డికి అండదండగా... : మాజీ మంత్రి పెద్దిరెడ్డి

**చౌడేపల్లి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**



సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రవిచంద్రారెడ్డికి అండ దండగా పెద్దిరెడ్డి కుటుంబముంటుందని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచం ద్రారెడ్డి అన్నారు. మండలంలోని పందిళ్ళపల్లి పంచా యతీ ముదిరెడ్డిపల్లిలో ఇటీవల రవిచంద్రారెడ్డి భార్య శోభ అనారోగ్యంతో మృతి చెందింది. ఆయన కుటుం బాన్ని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డిలు పరామర్శించారు. జడ్పీటీసీ నడింపల్లి దామోదర్‌రాజు, కొండవీటి నాగభూషణం, కృష్ణమూర్తి, మిద్దింటి కిషోర్‌బాబు, లడ్డు రమణ, కళ్యాణ్‌భరత్, రెడ్డిప్రకాష్, నాగభూషణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఠాణాదార్ నాగరాజ, శ్రీరామ్ భరత్ వరుణ్, గిరిరాజు, శ్రీనివాసులురెడ్డి, షంషీర్, హరి, మండంలోని వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

– ఆపరేషన్‌కు 52మంది ఎంపిక

**చిత్తూరురూరల్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:**



చిత్తూరుపట్టణం, గాంధీరోడ్డులోని లిటిల్‌రోస్ హైస్కూల్ నందు గ్లోబల్ స్పిరిచువల్ ట్రస్ట్, బెంగళూ రులోని శంకర కంటి ఆసుపత్రి సంయుక్తంగా ఆది వారం నిర్వహించిన ఉచిత కంటి ఆపరేషన్ల మెగా శిబిరం నందు 236మంది కంటి పరీక్షలు నిర్వహించి అందులో 52మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు గ్లోబల్ స్పిరిచువల్ ట్రస్ట్: మేనేజింగ్ ట్రస్టీ, పాఠశాల కరస్పాండెంట్ డా.బి.గోపాలక్రిష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా స్పిరిచువల్ ట్రస్ట్ తరపున ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ఉమెన్ ఎంపవర్‌మెంట్, మెడికల్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్, ఎడ్యుకేషనల్ అవేర్నెస్, డెంటల్ చెకప్, ఐ చెక్ అప్, ట్రీ ప్లాంటేషన్ లాంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. మొట్టమొదటి సారిగా శంకరకంటి ఆసుపత్రి వారిచే ఉచిత నేత్ర పరీక్షలు, అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్ల శిబిరాన్ని విజయంతంగా నిర్వహించామన్నారు. ఆపరేషన్లకు ఎంపికైన వారందరికీ ఉచిత వసతి, భోజన సదుపాయం, కంటి ఆపరేషన్ల కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి డాక్టర్లు దిష ఆగర్వాల్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శివప్రసాద్, ఆసుపత్రి సిబ్బందితో పాటు ఆర్యవైశ్య ప్రముఖులు, అడ్వకేట్స్, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## శబరిగిరీశుని సేవలో ఎన్వీఆర్ బృందం

**పుంగనూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :**



ఆధ్యాత్మికసేవావేత్త,సామాజిక సేవకుడు ఎన్వీ ఆర్‌ట్రస్టు వ వ్యవస్థాపకుడు ఎన్.వేణుగోపాల్‌రెడ్డి ఆది వారం ఉదయం శబరిమలలో శ్రీఅయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. నియోజకవర్గంలోనే ప్రముఖ దాతగా, సంఘసేవకులుగా గుర్తించబడిన వేణుగోపా ల్‌రెడ్డి పలుమండలాల గ్రామాలలో ప్రజల విద్యా, ఆరోగ్య, వైద్యసేవలకు సాయమందించడమే కాకుండా ఆలయాల,ప్రార్థనా మందిరాల అభ్యున్నతికి ఇతో ధికంగా కృషిచేస్తున్నారు. అయ్యప్పమాల దీక్షలో వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం స్వామి దర్శనంచేసుకుని ఇరుముడి చెల్లించారు. ఆయన వెంట ట్రస్టు సభ్యులు కూడా ఉన్నారని ట్రస్టు ప్రధాన కార్యదర్శి శివకుమార్‌రెడ్డి తెలిపారు.

## ఎస్.టి.యు మైనార్టీ కమిటీసభ్యుడుగా అంజాద్అలీఖాన్

**పెద్దపంజాణి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :**



రాష్ట్రఉపాధ్యాయసంఘం(ఎస్.టి.యూ) రాష్ట్రస్థాయి మైనార్టీకమిటీసభ్యుడిగా మండలంలోని బసకందొడ్డి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు అంజాద్‌ఆలీఖాన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు.ఈయన ఎంపికకావడంపట్ల మండల ఎస్టీయూ అధ్యక్షుడు బాబురెడ్డి,ప్రధానకార్యదర్శి గురుప్రసాద్,ఆర్థికకార్యదర్శి శివప్రసాద్‌బాబు,జిల్లా ఎస్.టి.యూ నాయకులు హర్షం తెలియజేశారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఎన్‌బికెఆర్‌లో ఘనంగా ఇంజనీర్స్‌డే

**కోట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**



ఇంజనీరింగ్ అంటే మొదట గుర్తుకొచ్చేది మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ప్రఖ్యాత ఇంజనీర్‌గా ఆయన దేశం లోని అనేక నిర్మాణాల్లో తనదైన ముద్ర వేసుకు న్నారని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఆదివారం కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి విజయకుమార్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య నైపుణ్యం, మేధోసంపత్తి, ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారన్నారు. ఆయన సమాజానికి అందించిన ఇంజనీరింగ్ వ్యవస్థను ప్రపంచంలోనే ప్రఖ్యాత కళాశాలల్లో ఇంజనీరింగ్ పాఠాలుగా బోధిస్తున్నారని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ పితామహుడిగా విశ్వేశ్వరయ్య అందించిన స్ఫూర్తితో సవాళ్ల అధిగమించి ప్రగతి దిశగా పురోగిస్తామని భావి ఇంజనీర్లకు దిశాదశా నిర్దేశం చేస్తామన్నారు. అనంతరం సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి భారత యువ ఇంజనీర్లు సమాజంలో ప్రస్తుతం ఎదుర్కొంటున్న వరదలు, పలు సమస్యలకు ఇంజనీరింగ్ రంగం ద్వారా పరిష్కారం వెతికి దేశం ముందు ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ పి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం చేయాలని సిఐకి విజ్ఞప్తి చేసిన మహిళలు

**వెంకటగిరి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త**



పోలీస్ స్టేషన్ వద్ద బాలాయపల్లి మండలానికి చెందిన పలువురు దాసరిపల్లి రమణయ్య అనే వ్యక్తి తమ పై అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని ఆందోళన చేశారు. వంద మంది పైన అతను తప్పుడు కేసులు పెట్టారని వారు ఆవేదన చెందారు. ఓజిలి మండలానికి చెందిన రమణయ్య తమను పలు రకాలుగా ఇబ్బంది పెడుతున్నట్లు మహిళలు ఆందోళన చెందారు. వంద మందికి పైన అక్రమ కేసులు రమణయ్య పెట్టించారని ఆందోళన చెందారు. రమణయ్యపై చర్యలు తీసుకోవాలని సిఐ వెంకటరమణకు మహిళలు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి న్యాయం చేస్తానని సిఐ వారికి తెలిపారు.

## జనసేన పార్టీ నేతల మధ్య రగులుతున్న విభేదాలు

పరస్పరం ఆరోపణలు



**వెంకటగిరి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త**

జనసేన పార్టీలో నాయకులు మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. నాయకులు పరస్పరం బహిరంగ ఆరోపణలు చేసుకుంటున్నారు. జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గూడూరు వెంకటేశ్వర్లు, నాయకులు తోట కృష్ణయ్య, రామారావు, అనీల్ నాయకులు పరస్పరం విమర్శలు చేసుకున్నారు. తనపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని గూడూరు వెంకటేశ్వర్లు ఆరోపణలు చేయగా వాటిని తోట కృష్ణయ్య ఖండించారు. తన పై తప్పుడు కేసులు కూడా పెట్టారని ఎవెంకటేశ్వర్లు విమర్శించారు. వెంకటేశ్వర్లు పార్టీని భ్రష్టు పట్టించారని పార్టీని ఎదగకుండా చేశారని తోట కృష్ణయ్య విమర్శించారు. జనసేన పార్టీ నాయకులు మధ్య విభేదాలు గత కొంతకాలంగా తగ్గులుతుండగా ఇప్పుడు ఒక్కసారి బగ్గుమన్నాయి. నాయకులు మధ్య విభేదాలు తారస్థాయికి చేరకముందే అధిష్టానం చర్యలు తీసుకొని విభేదాలకు కట్టడి చేయాలని జనసేనకు చెందిన నాయకులు కోరుతున్నారు.

## శ్రీచెంగాళమ్మ అన్నదానానికి రూ.70 వేలు విరాళం

**సూళ్లూరుపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**

సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరి దేవ స్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆది వారం 70 వేల రూపాయలు విరాళం అందింది.



గూ దూరుకు చెందిన కళగట్ల పట్టాభిరామయ్య, శారద దంపతులు రూ.50,116, నగరికి చెందిన ఎజి యుగేష్ 20 వేల 1 రూపాయలు నిత్యాన్నదానానికి విరాళం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస బాబుకు ఈ విరాళాలు మొత్తాన్ని అందజేశారు.

## సమస్యల మీద దృష్టి పెడదాం : నేదురుమల్లి

**వాకాడు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త**



పేదల సమస్యల సృజనాత్మకంగా పరిష్కరించే విధంగా వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి సూచించారు. ఆదివారం వాకాడులోని నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి నివాసంలో నాయకులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని సమస్యల మీద, ఇసుక, సిలికా వంటి విషయాలపై వైఎస్ఆర్‌సిపి నాయకులతో చర్చించారు. ప్రతి సమస్య మీద ఆలోచనతో పని చేయాలన్నారు. ఇప్పటి నుండి వైఎస్ఆర్‌సిపి నాయకులు బలోపేతమై ముందుకు సాగాలన్నారు.వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు కొడవలూరు దామోదర్ రెడ్డి, సర్పంచ్ సిద్ధారెడ్డి మధుసూదన్ రెడ్డి, ఉప సర్పంచ్ పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి, సుధాకర్ నాయుడు, రవిశేఖర్ రెడ్డి, నాగూర్ రెడ్డి, భార్గవ్, పెంచల రెడ్డి, గూడూరు సుధాకర్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యుల సైతం విరాళాలు అందజేయడం స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

**గూడూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త**



వరద బాధితులకు సామాన్యుల సైతం ముందుకొచ్చి విరాళాలు అందించడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని గూడూరు ఎమ్మెల్యే నివాసం వద్ద, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రముఖ ల్యాండ్ డెవలపర్స్ సత్యంజీ గ్రూప్ వారు గోపిశెట్టి ఆనంద్ లక్ష రూపాయిలు విరాళం, హరిబాబు 25 వేల రూపాయిలు, వెటర్నరీ డాక్టర్ సురేష్ 25 వేల రూపాయలు విరాళం చెక్కులను గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు పట్టణ పరిధిలో అనేక మంది సామాన్యులు స్పందించి విరాళాలు అందజేయడం అభినందనీయమని అన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని అవకాశమున్న ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి సిఎం సహాయ నిధికి విరాళాలు అందజేయాలని పిలుపునిచ్చారు. విరాళాలు అందించిన వారి దాతృత్వాన్ని చాటుకున్నారని ఎమ్మెల్యే ప్రశంసించారు. సోమిశెట్టి సాయి కృష్ణ, మాముదురు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భరత్ టెక్ లీగ్ జోనల్ ఈవెంట్

**గూడూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త**



గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో భారత్ టెక్ లీగ్ జోనల్ ఈవెంట్‌ను ఇంజనీర్స్ డే సందర్భంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎస్‌పో కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిశంకరలో భారత ప్రభుత్వం సహకారంతో అటల్ టిం కరింగ్ ల్యాబ్‌ను నిర్వహిస్తున్నా రన్నారు. ఈ ల్యాబ్ ఎంతో దోహదపడు తుందన్నారు. విద్యార్థులు, సైన్స్ కాంగ్రెస్, ఇన్స్పైర్ వంటి కార్యక్రమాల్లో పాల్గొని ఆవిష్కరణలు ప్రదర్శించేందుకు ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు చిన్నతనం నుండే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహన పెంచుకొని ఎదగలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతిభ కనపరిచిన వారిని 22న విశాఖపట్నంలో ఉన్న ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహిం చనున్న నేషనల్ ఈవెంట్‌కు పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ వేణు మాధవ్, ఇమ్మనుయెల్, వెంకీ అనూష, రామయ్య, ప్రదీప్, కార్తీక్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

## డివిసత్రంలో ఉచిత నేత్ర శస్త్ర చికిత్సా శిబిరం

**దొరవారిసత్రం సెప్టంబరు 15 ప్రభాతవార్త**

దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయంలో లయన్స్‌క్లబ్-కోగిలి జయరామిరెడ్డి చారిటేబుల్ సొసైటి ఆధ్వర్యంలో తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి వారు ఉచిత నేత్ర శస్త్ర చికిత్సా శిబిరం ఆదివారం నిర్వహించారు. మండలంలోని పలుగ్రామాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న వారు 120మంది పాల్గొని కంటిపరీక్షలు చేయించుకొన్నారు.అందులో 40మందిని కంటి శాస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు వైద్యులు తెలిపారు.మిగిలిన 80మంది రోగులకు కంటిపరీక్షలు నిర్వహించి అద్దాలు,మందులు ఉచితంగా పంపిణీ చేశారు.ఈశిబిరం ఉదయ ం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించారు.శస్త్రచికిత్సకు ఎంపిక చేసిన 40మంది రోగులను తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ చేర్మన్ పిజెసి రెడ్డి,జోన్ చేర్మెన్ ఆదిశేషారెడ్డి,కార్యదర్శి రాధాక్రిష్ణరావు,ఉదయ్‌కుమార్‌రెడ్డి,డాక్టర్లు,సిబ్బంది,తదితరులు ఉన్నారు.

## జైజై గణేశ.. బై బై గణేశ

**కోట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**



మండలంలోని విద్యానగర్, కోట గ్రామాల్లో గణ పతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం వినాయకుని గ్రామోత్సవాలో అంగరంగ వైభవంగా జరిగాయి. మండలపాల వద్ద గణపతి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటలోని నల్ల పరెడ్డి శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీ వాసులు, చెందో దులోని దళితవాడలో వినాయక గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పలు రూపాల్లో దర్శనమిచ్చిన ఏకదంతుని దర్శనానికి గ్రామ పురవీధుల్లో భక్తులు తరలివచ్చారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, నృత్యాలతో గణనాథుడిని ఊరేగించి సముద్ర తీరంలో నిమజ్జనం చేశారు. ఆదివారం వాకాడు మండలం తూపిలిపాలెం వద్ద సముద్ర తీరం సందడిగా మారింది.

## సామాజిక ధృక్పథంతో ముందడుగు

– ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు

**చిత్తూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:**

చిత్తూరు నగరంలోని ద్విచక్ర వాహనదారుల మెకానిక్‌లు సామాజిక ధృక్పథంలో ముందుడుగు వేయా లని ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు పిలుపునిచ్చారు. చిత్తూరు అంబేద్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన చిత్తూరు ద్విచక్రవాహన మెకానిక్స్ సంఘ ప్రథమ వార్షికోత్సవానికి ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులు ఎద్దైనా సమస్యలు వుంటే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరింకోవాలని కోరారు. రాష్ట్ర సంఘ అధ్యక్షులు దాయనేని ధర్మారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షలకు పైగా ద్విచక్రవా హనాల మెకానిక్స్ వున్నారని, వారికి ఇప్పటి వరకు సరైన గుర్తింపు లేదన్నారు. తమను అసంఘటిక కార్మికులుగా గుర్తిస్తే పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు అర్హులవుతామన్నారు. తన సంఘ భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిజెఎం ఫౌండేషన్ నిర్వాహకులు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు తండ్రి గురజాల చెన్నకేశవులునాయుడు, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య,చిత్తూరునగరసంఘఅధ్యక్షులుమురుగేష్,జిల్లా ఉపాధ్యక్షులు ఇస్మాయిల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మణరావు, నగర కార్యదర్శి బాలచంద్ర, సంయుక్త కార్యదర్శి ఎస్‌కె మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలను ఆరోగ్యవంతులు చేయడమే వైదేహి ధ్యేయం



– కో-ఆర్డినేటర్ నానబాల లోకేశ్వర

**శ్రీరంగరాజపురం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:**

పేద ప్రజలందరికీ ఆధునిక వైద్యం అందించి వారిని ఆరోగ్యవంతులను చేయడమే వైదేహి ఇన్స్టి ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రిసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ధ్యేయమని కో-ఆర్డినేటర్ నానబాల లోకేశ్వర పేర్కొన్నారు. పుల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం వైదేహి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సెన్సెస్ అండ్ రిసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంకు 110 మంది రోగులు హాజరై ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించుకుని ఉచితంగా మందులు పొందారు. వచ్చిన వారిలో 18 మంది ఆపరేషన్లకు అర్హులుగా గుర్తించిన వైద్య బృందం వీరికి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజీ డాక్టర్ ప్రవీణ్, కమ్యూనిటీ మెడిసన్ డాక్టర్ మనోజ్, జనరల్ మెడిసన్ డాక్టర్ హర్షితరెడ్డి, మెడికల్ ఆంకాలజీ వైద్యులు డాక్టర్ రంజిత, జనరల్ సర్జరీ డాక్టర్ పృధ్వీరెడ్డి, ఆర్థో వైద్యులు డాక్టర్ సంజయ్, కంటి వైద్యురాలు డాక్టర్ దిశ, ఎకో టెక్నిషియన్లు హర్ష, మేల్ నర్సు సంకేష్, జనసేన పార్టీ ఎస్ఆర్ పురం మండల అధ్యక్షుడు చిరంజీవి, సర్పంచ్ భవ్య, ప్రజలు పాల్గొన్నారు.

## భీమినేని చిట్టిబాబును సన్మానించిన బెంగళూరు నగర కమ్మ సంఘం

**పాలసముద్రం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:**



రాష్ట్ర తెలుగుదేశం కార్యనిర్వాహక కార్యదర్శి భీమి నేని చిట్టిబాబునాయుడును ఆదివారం బెంగళూరు నగర కమ్మ సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానిం చారు. భీమినేని చిట్టిబాబునాయుడు జిడినెల్లూరు నియోజకవర్గ పరిధిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో బెంగ ళూరు నగర కమ్మ సంఘ ప్రతినిధులు ఆయ నను సన్మానించారు. ఈ సందర్భంగా భీమినేని చిట్టిబాబునాయుడు మాట్లాడుతూ ఇలాంటి సన్మానాలతో మరింత సమాజ సేవకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# తిరుపతి డివిజన్

## వేమూరులో వినాయక చవితి లడ్డు వేలం

### -రికార్డు స్థాయిలో రూ.31000 ధర పలికిన లడ్డు

తిరుపతిరూరల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం వేమూరులో వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా ఆదివారం నిర్వహించిన లడ్డు వేలం పాటకు విశేష ఆదరణ లభించింది. వినాయక లడ్డుకు పలువురు పోటీపడగ బ్రాహ్మణపట్టు ఎంపిటిసి బి.యోగానందరెడ్డి రూ.31000 రుపాయాలకు లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా యోగానందరెడ్డి మాట్లాడుతూ వినాయక స్వామి ప్రసాదాన్ని వేలం పాటలో దక్కించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. వినాయక మండపం నుండి ఊరేగింపుగా లడ్డును ఊరేగింపుగా తీసుకెళ్ళి భక్తులకు పంపిణి చేసారు.

## కైలాసగిరుల్లో సెటిల్‌మెంట్ ఎలా వచ్చింది?!

### శాఖల మధ్య సమన్వయ లోపం: శివయ్య భూములకు ప్రమాదం

శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త



లీడ్(శ్రీకాళహస్తీశ్వరునికి నాడు పరిపాలించిన రాజులు 24వేల ఎకరాల భూములను భవిష్యత్తులు నిర్వహణ దృష్ట్యా కైలాసగిరి పర్వత పంక్తుల్లో కేటాయించారు. దేవాదాయశాఖ పర్య వేక్షణ లేక ఈ భూముల కరిగిపో యాయి. 1994లో శాసనసభలో కమ్యూనిస్టు నాయకుడు ప్రశ్నించగా హడావిడిగా సర్వే జరిపి 5400 ఎకరాలు ఉన్నట్లు తేల్చారు. ఇక్కడ ఫెన్సింగ్ ప్రతిపాదన అమలు జరగటం లేదు. గత పాలకులు చక్కగా సిమెంటు రోడ్లు నిర్మించారు. రోడ్డు పక్కన భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. అవకాశం ఉన్నంత వరకు పలుకుబడి కల్గిన వారు ఆక్రమించుకుంటున్నారు. తమకు పూర్వ కాలం సెటిల్ మెంట్ పట్టాలు ఉన్నాయని బుకాయిస్తున్నారు.)

***కైలాసగిరిలో భూముల ఆక్రమణలు:***

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి కైలాసగిరుల్లో ఉన్న భూములకు రక్షణ కరువైంది. శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలో తుఫాన్ సెంటర్ పరిసరాలు రోజు రోజుకు ప్రాధన్యత సంతరించుకుంటు న్నాయి. ఈ నేపధ్యంలో పరిసరల్లో భూములను పలుకుబడి ఉన్న వారు ఆక్రమించుకుంటున్నారు. తమకు ఉన్న హక్కుతో పాటు సద్వినియోగం చేసుకొనుటకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపధ్యంలో దీర్ఘకాలంగా ఓ భూమికి సంబందించిన వివాదం సాగుతుంది. శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తుల సౌకర్యార్థం చక్కటి రోడ్డును నిర్మించారు. దాంతో దాని పక్కనే ఉన్న భూములతో పాటు సుమారు 2 ఎకరాల దేవస్థానం భూములను ఓ పలుకుబడి కల్గిన వ్యక్తి అనుభవిస్తున్నారు. గత ప్రభుత్వంలో 'నాయకుడు' అక్రమణదారునికి మద్దతుగా ఉండటంతో అధికారులు నిస్సహాయులయ్యారు. కైలాసగిరుల్లో గల దేవస్థానం భూముల్లో చిట్టత్తూరు వద్ద దళితులు 1.5ఎకరాల భూములను ఆక్రమించుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇక తుఫాను సెంటర్ సమీపంలో సర్వే నెంబర్ 235/2లో అమ్మపాళెం గ్రామానికి చెందిన బాబురెడ్డి దేవస్థానంకు సంబంధించిన రెండు ఎకరాల వరకు భూములను అనుభవిస్తున్నారు. ఈ వివాదాలకు సంబంధించి గతంలో రెవెన్యూ అధికారులు సర్వే జరిపి నివేదికలు దేవస్థానంకు అందించారు. దేవస్థానం పలు మార్లు ఈ భూములకు సంబంధించి స్పందించినా గతంలో ఆక్రమణ దారునికి మాజీ శాసనసభ్యుడు మద్దతుగా ఉండటంతో దేవస్థానం ఏమి చేయలేక పోయారు. అయితే ఆక్రమణ దారుడు తనకు సెటిల్ మెంట్ పట్టా ఉందంటూ చెబుతున్నట్లు సమాచారం. ఈ పట్టా 1988లో శాసనస భ్యుడుగా ఉన్న చెంచురెడ్డి మద్దతుతో పొందినట్లు చెబుతున్నారు. అయితే దేవస్థానంకు సంబంధించిన ఆస్తుల్ని కాపాడాల్సిన ప్రజా ప్రతినిధులు ఇలా తమ మద్దతుదారులకు ధారాదత్తం చేస్తూ పోతే చివరకు 'శివయ్యకు విభూది'కూడా మిగలదన్న విషయాన్ని గ్రహించాలి. దేవస్థానం నుంచి జీతాలుతీసుకునే అధికారులు, సిబ్బంది రాజకీయ పలుకుబడికి తలొగ్గకు వ్యవహరిస్తేనే రక్షణ ఉంటుందనే విషయం గ్రహించాలి. ఇప్పటికైనా వాస్తవికతతో పరిశీలించి ఆక్రమణ దారుల చెర నుంచి కాపాడాలని కోరుతున్నారు.

## కాగుతున్న వంట నూనెల ధరలు

### కేంద్రంపై మండిపడుతున్న వినియోగదారులు

### దిగుమతి సుంకం 20శాతం పెంపు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

ఒక్కరోజులో లీటర్ వంట నూనె ధర విపరీతంగా పెరిగింది. ఇదేమి చొద్యం అంటూ వినియోగదారులు దుకాణం దారుల మీద మండిపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం వంట, దీపం నూనెల దిగుమతిపై సుంకం 20శాతం విధించింది. దాంతో ఒక్క సారిగా నూనెల ధరలు పెరిగాయి. ప్రభుత్వం విషయం ప్రకటించిన వెంటనే వ్యాపారస్తులు చక చకా పెంచేసుకున్నారు. అయితే కిరాణ వర్తకుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. జనం చిల్లర కిరాణ వ్యాపారస్తులపై తిరగబడుతున్నారు. శనివారం లీటర్ పామోలిన్ అయిల్ రూ.95లకు కొనుగోలు చేసిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వాళ్లు ఆదివారం రూ.120లు అనటంతో కొనుగోలు దారులు భగ్గుమంటున్నారు. నిత్యం ఉపయోగించే వంటనూనెలపై ధరలు పెంచటమా? అని వాపోతున్నారు. ఇక సన్‌ఫ్లవర్ అయిల్ ధరలు కూడా లీటర్‌కు రూ.20 పెరిగాయి. ఒక లీటర్ రూ.120లకు దొరుకుతుండగా ఆదివారం రూ.140లకు పెరిగింది. ఇక దీపం నూనెల ధరలు కూడా లీటర్‌కు రూ.20 పెంచేశారు.

***ధరల దడ:***

మార్కెట్‌లో ధరల దరువు సాగుతుంది. ఇప్పటికే ఉల్లిపాయలు కిలో రూ.60లు ఉండగా వెల్లుల్లి కిలో రూ.600లకు పెరిగింది. ఈ ధరలతోనే కకుదేలౌతున్న వినియోగదారుడు మరో షాక్‌గా వంటనూనెల ధరలు హఠాత్తుగా పెరగటంతో సామాన్యుడు పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఇక ఇప్పటికే హోటళ్ళలో ధరలతో తల్లడిల్లుతున్న సామాన్యులకు ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచటంతో ఖంగుతింటున్నారు. బతుకు జీవనం కోసం పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో వీధికి కనీసం ఐదారు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, పానీ పూరి సెంటర్లు, తోపుడు బండ్లపై టిఫిన్ సెంటర్లు నిర్వహించుకుంటున్నారు. అయితే ధరల దరువుతో బతుకు బండిని ఎలా లాగాలని బాధపడుతున్నారు.

## పేదలపై పిట్టి కేసులతో భయభ్రాంతులు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని పాదాల చెంత బతుకు జీవనం కోసం ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను నిర్వహించుకుంటున్న నిరుపేదలపై పోలీసులు పిట్టి కేసులు పెట్టి కోర్టుకు హాజరు పరచి జరిమానాలు వసూలు చేయటంతో నిరుపేదలు పాలకులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి సమాచారం లేకుండా పోలీసులు పేర్లు నమోదు చేసుకొని కోర్టుకు హాజరు కావవాలంటూ ప్రత్యేక ఆటోల్లో తీసుకెళ్ళటం రోజంతా కోర్టులో నిల బెట్టడం రూ.వెయ్యికి తగ్గకుండా జరిమానా వసూలు చేయటంతో కుములు తున్నారు. శనివారం ఆలయానికి వచ్చే భక్తులతో అల్పాహారం షాపులకు వ్యాపారం ఉంటుంది. వ్యాపార సమయంలో పోలీసులు తమను కోర్టులో నిలబెట్టడంతో వ్యాపారం కూడా నష్టపోతున్నామని వాపోతున్నారు. గతంలో ఇలాంటి వాతావరణం లేదని ప్రస్తుతం పోలీసుల తీరుపై చిరువ్యాపారుల్లో తీవ్ర అసంతృప్తి చోటు చేసు కుంటుంది. ఇక పట్టణంలో అర్థరహిత ట్రాఫిక్ నిబంధనలు జరిమానాలంటూ భయభ్రాంతుల్ని చేస్తు న్నారనేవిమర్శలుచోటుచేసుకుంటున్నాయి. దాంతో శాసనసభ్యునిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తు న్నారు.

## అంబరాన్నంటిన జల్లికట్టు సంబరాలు

### పూలవారికండ్రిగలో పోటెత్తిన పల్లెజనం

వెదురుకుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:



పశువుల పండుగ జల్లికట్టు సంబరాలను గ్రామీణ యువత అంబరాన్నంటేలా జరుపు కున్నారు. మండల పరిధిలోని కొమరగుంట పంచాయతీ, పూలవారికండ్రిగలో ఆదివారం పోటెత్తిన పల్లెజనం ఉరకలెత్తే కోడెగిత్తలను నిలువరించేందుకు పోటీ పడ్డారు. ఇందులో భాగంగా పాడి రైతు ఎద్దుకు కట్టిన పట్టీని ఒడిసి పట్టుకోవడం కోసం పోటెత్తిన పౌరుషంతో యువకులు పోరాటపటిమను కనబరిచారు. ఏడాదికి ఒకమారు పాడిరైతులు జరుపుకునే పశువుల పండుగలో ఏడాది పొడవునా తమకు చేదోడుగా నిలిచి పండిన పంటలను ఇంటికి చేర్చే కాడెద్దులకు పూజలు జరిపించి వాటిలోని ఉత్సాహాన్ని, పౌరుషాన్ని వెలికితీయడమే లక్ష్యంగా జల్లికట్టు సంబరాలు నిర్వహిస్తారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిని సత్కరించిన మాజీ ఎంఎల్ఏ



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

జాతీయ ఉత్తమ ఉపాధ్యా అవార్డు గ్రహీన కూనాటి సురేష్‌ను ఆదివారం మాజీ ఎంఎల్ఏ ఎస్‌సివినాయుడు ఆయన నివాసంలో సగౌరవంగా సత్కరించారు. శ్రీకాళహస్తిలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కూనాటి సురేష్ జాతీయ ఉత్తమ అవారక్డు వరించిన సందర్భంగా ఆయనకు దుశ్శాలువ, పూలమాలతో సత్కరించి మెమొంటోను బహుకరించి అభినందించారు. ఈసందర్భంగా మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులు స్థానం ఉన్నతమైందని తల్లి, తండ్రి తర్వాత ఉన్నతమైన స్థానాన్ని గురువకే ఇచ్చారని అంతటి మహోన్నత స్థానంలో ఉండి విద్యార్థిని విద్యార్థుల భవిష్యత్తుకోసం అహర్నిశలు కృషిచేస్తున్న కూనాటి సురేష్‌ను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం సంతోషమన్నారు. కార్యక్రమంలో గోగినేని భాస్కర్‌నాయుడు, రవినాయుడు, సుదర్శన్‌నాయుడు, పామంజి సుబ్రమణ్యం, డిల్లీప్రతాప్, ఇర్లకిషోర్, కాంగ్రెస్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## నీటి కుంట పూడ్చివేస్తున్నారు.. ఆపండి మహాప్రభో..

### ఇలా కుంటలు, వాగులు, వంకలు, చెరువులు పూడ్చి వేస్తే ఎలా..

పాకాల, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త



పాకాల మండలం ఉప్పరపల్లి పంచాయితీ దామల చెరువు రోడ్డులో ఉండే రైల్వే బ్రిడ్జి మలుపులో దాదాపు నాలుగు ఎకరాల విస్తీర్ణం ఉండే నీటి కుంటను కొంత మంది వ్యక్తులు చదును చేసి ఇప్పటికే ప్లాట్ల రూపంలో అమ్మేసుకోగా, మరి కొంత మంది ఇండ్లు కట్టేసుకోగా, మిగిలిన కొంచం కుంట భూమిని కూడా నామరూపాలు లేకుండా చేయాలని కొంత మంది ట్రాక్టర్ జెసిబి యజమానులు పనిగట్టుకొని వారి స్వార్ధపూరిత ప్రయోజనమే లక్ష్యంగా నీటి కుంటను ట్రాక్టర్ల సహాయంతో పూడ్చివేస్తున్నారు. ప్రస్తుతం కాలిగా ఉన్న భూమి విలువ దాదాపు మూడు కోట్ల రూపాయిలు పైగా విలువ చేసే నేలను సొంతం చేసుకునే ప్రయత్నంలో భాగంగా వేస్ట్ మట్టిని, రాళ్లను తీసుకువచ్చి దర్జాగా కుంటలో ట్రాక్టర్ల ద్వారా నింపేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయితీ రెవెన్యూ అధికారులు తమ మెతక వైఖరి వీడి వెంటనే స్పందించి పోలీసు వారి సహాయంతో ఇప్పటి వరకు ఈ ఘటనకు పాల్పడిన ట్రాక్టర్ యాజమానులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి వారి ద్వారానే కుంట సూర్వ స్థితికి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కుంట దగ్గర సూచిక బోర్డును ఏర్పాటు చేసిన అక్రమ పూడ్చివేతదారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది ఆయకట్టుదారులు, ప్రజలు కోరుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని నారా యువశక్తి ప్రసిడెంట్ మచ్చాదొరస్వామి నాయుడు, నారా సుబ్రమణ్యం నాయుడు, అధికారులను కోరుచున్నారు.

## తిరుచ్చి వాహనంపై "శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు"

చంద్రగిరి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణ నక్షత్రంను పురస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, అర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఆలయ సిబ్బంది చెంగయ్య, రాజ శేఖర్, రవిచంద్రన్, డాక్టర్ ఉదయ్‌తేజ, ఘనాపాటి తిరువెంగడం, భీంసేన రెడ్డి, తదితరులుపాల్గొన్నారు.

## దళారులపై ఇఓ కనెర్ర!

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారుల వ్యవస్థను రూపు మాపుతామని పాలకుల ప్రకటనలే తప్ప ఆచరణకు నోచుకోవటం లేదు. ప్రకటనలు చేయటం నాయకులకు తగును కానీ దానిని ఆచరించాల్సింది అధికా రులు, సిబ్బంది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం వరుస సెలవులతో రద్దీ చోటు చేసుకుంది. దాంతో మరో సారి కొందరు పరితెగించిన దళారులు ఇఓ ఆలయంలో ఉంటేనే తమ పబ్బం గడుపుకొనుటకు ప్రయత్నించి భంగ పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఆలయం వరుస సెలవులతో రద్దీగా మారింది. ఎటు చూసినా జనమే జనం అన్నట్లు మారింది. అంతేకాక ఓ వైపు రద్దీ మరో వైపు 'పవిత్రోత్సవాల' కార్యక్రమాలతో సందడిగా ఉండగా కొందరు గుర్తింపు కార్డులు, యూనిఫారాలు లేకుండా సంచరిస్తుండటంతో గమనించిన ఇఓ ఎన్‌వియస్‌ఎన్ మూర్తి వారిని గుర్తించి మందలించారు. మరో సారి కనిపిస్తే పోలీసులకు అప్పగిస్తామని క్రిమినల్ కేసులు బనాయిస్తామంటూ హెచ్చరించారు.

***విధి విధానాల్లేవు . . .***

శ్రీకాళహస్తీశ్వరాలయంలో గత కొన్ని సంవత్సరాలుగా దళారుల అడ్డగా మారిందనే విమర్శలు, ఆరోపణలున్నాయి. ఇక్కడ అడుగుపెట్టిన భక్తులను ఓ వైపు దళారులు మరో వైపు నిలువుదోపిడి చేస్తున్నారు. కొత్త పాలన వచ్చిన తరువాత దళారుల తోలు వలుస్తామంటూ హెచ్చరించారు. అయితే ఈ ఆదేశాలను అధికారులు స్పష్టమైన విధి విధానాలను సిబ్బందికి సూచించాలి. ఎవరైనా సరే కంచుగడప నుంచి ప్రవేశించాల్సిందే. కంచుగడప వద్ద హోంగార్డులు, ఎస్‌పిఎఫ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షిస్తుంటారు. వీరితో పాటు ఆలయ ఉద్యోగులుంటారు. అయితే వారికి స్పష్టమైన ఆదేశాలు ఉంటే వారు అమలు పరుస్తారు. ఇక్కడ రక్షణ సిబ్బందియే కాకుండా డెప్యూటీ ఇఓ, ఏఇఓ పర్యవేక్షిస్తుంటారు. వారితో పాటు దేవస్థానం సిబ్బంది ఉంటున్నారు. అయినా సంబంధం లేని వ్యక్తులు సంచరిస్తూ ఇఓకే పట్టుబడ్డారంటే దళారులపై నియంత్రణ ఎలా ఉ ందో ముక్కంటీశుడే గుర్తించాలి!

## శివయ్య సేవలో హైకోర్టు న్యాయమూర్తి:

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరా లయానికి అతిధుల తాకిడి పెరుగుతుంది. ఈ నేపధ్యంలో ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి సూరి అప్పారావు కుటుంబసభ్యులతో శివయ్య సేవకు వచ్చారు. వారికి మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు వడకలూరు మస్తానయ్య స్వాగతం ఏర్పాటు చేసారు. ఆలయ మర్యాదలతో ఇఓ ఎన్‌వియస్‌ఎన్ మూర్తి స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయ ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## కోలాహలంగా పెండ్లిమండపం గణపతి నిమజ్జనం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

పట్టణంలోని పెండ్లిమండపం వద్ద ఏర్పాటు చేసిన హనుమంతునిపై గణపతి ఆదివారం నిమజ్జనం కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. జైభోలో గణేష్ మహారాజ్‌కి జై అంటూ నినాదాలు చేస్తూ నిమజ్జనం సాగింది. పెండ్లిమండం నుంచి బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధులగుండా గ్రామోత్సవాన్ని నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తిచేశారు. కార్యక్రమంలో పెండ్లిమండపం గణేష్ నిమజ్జనం యువత పాల్గొన్నారు.

## జగ్గరాజుపల్లి వద్ద రోడ్డు ప్రమాదం:

### ఒకరుమృతి: మరొకరు ఆసుపత్రి పాలు



...ంబర్ 15 ప్రభాతవార్త

...రం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ...లతో తిరుపతి రుయాకు తరలించారు. సంఘటన ...ుకొని సమాచారం సేకరించారు. వివరాలు ఇలా ...న బాలవర్ధన్ కుమారుడు వెంకటేష్(19) కామయ్య ...ుత్తం సమీపంలోని వెంకటగిరికి వెళ్ళి తిరిగి తమ మోటార్ సైకిల్ మీద స్వగ్రామానికి వస్తుండగా జగ్గరాజు పల్లి వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనాన్ని నడుపుతున్న వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సిఐ రవినాయక్ వివరించారు. వెంకటేష్ బిటెక్ అనంతపురంలో చదువుతుండగా జయకుమార్ బిటెక్ పూర్తి చేసారు. ఇరువురు వినాయక చవితి ఎసెలవులకు స్వగ్రామానికి వచ్చినట్లు సమాచారం. సోమవారం వారు చదువుకు వెళ్ళాల్సి ఉంది. అయితే ట్రాక్టర్ డ్రైవర్ పరారిలో ఉన్నట్లు సిఐ వివరించారు.

## అక్షరాలు నేర్పిన గురువులకు సత్కారం:

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలో తమకు అక్షరాలను నేర్పి ప్రయోజ కుల్ని చేసి తమకు సమాజంలో గుర్తింపు తెచ్చిన గురువులకు ఆదివారం పూర్వ విద్యార్థుల సమావేశం లో సత్కరించారు. పట్టణంలోని భాస్కరపేటలో 1996-97లో పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం పట్టణంలోని ఎస్‌డికె నగర్‌లోని సిఎం ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా నాటి విద్యార్థులు నేటి ఉద్యోగుల సమావేశం అయి పూర్వ జ్ఞాపకాలను పంచుకున్నారు. ఆత్మీయ సమావేశంగా జరిపుకున్నారు. తాము అక్షరాలు నేర్చుకున్న భాస్కరఫేట ఉన్నత పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. తరువాత తమకు అక్షరాలు నేర్పిన గురువులకు సత్కరించారు. ఈ కార్యక్రమాల్లోకెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మన మధుసూధనరావు, స్మార్ట్ గయ్స్ అధినేత గంజి సుబ్బరాయులు, చంద్ర, సుకుమార్‌ల సారధ్యంలో ఆత్మీయ సమావేశం జరుపుకున్నారు.

## గౌడసంఘ ఆత్మీయ సమావేశం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త



పట్టణంలోని పొన్నాలమ్మగుడి ఆవర ణలో తిరుపతిజిల్లా మరియు శ్రీకాళ హస్తి నియోజకవర్గ గౌడ సంఘం గీత కార్మికులు ఆత్మీయ సమావేశం నిర్వ హించారు. సమావేశానికి జిల్లాలోని గౌడసోదరులు శ్రీకాళహస్తి నియోజక వర్గంలోని గౌడసోదరులు హాజరయ్యా రు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజకీయ రంగంలో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని, రిజర్వేషన్ ప్రకారం గౌడ సంఘం ఆధ్వర్యంలోపదువులు ఇవ్వాలని పేర్కొన్నారు. సమావేశంలో గౌడసంఘం నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర కార్యదర్శి అపూర్వ చంద్రకు ఘనస్వాగతం

రేణిగుంట, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:



గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఫ్యామిలీ వెల్ఫేర్ సెక్రటరీ రేణిగుంట విమానాశ్రయంలో ఆదివారం ఘన స్వాగతం లభించింది. న్యూ ఢిల్లీ నుంచి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీహరి, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్, రేణిగుంట తహసీల్దార్ సురేష్‌బాబు, తదితరులు ఘన స్వాగతం పలికారు.

## నిరంతర శ్రామికుడు నరేంద్ర మోదీ

రేణిగుంట, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:



భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి నిరంతరం శ్రమిస్తున్న శ్రామికుడు ప్రధాన మంత్రి మోదీ అని బీజేపీ యువనేత వెంకటాద్రి యాదవ్ అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం వెంకటాపురం పంచాయతీ అంక నాయుడు మిట్టలో వెంకటాద్రి యాదవ్ నాయకత్వంలో ఆదివారం జరిగింది. పలువురు బీజేపీ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని చులకన చేసే అగ్రరాజ్యాలకు భారత్‌గొప్పదనం ఏమిటో రుజువు చేసిన గొప్ప ప్రధానిగా మోదీని అభివర్ణించారు. మోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని రంగాల్లో పలు ప్రపంచ దేశాలతో పోలిస్తే ముందంజలో ఉన్నాయన్నారు. అమరావతి రాజధానిగా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి మోదీ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరుచేస్తున్నారని దీంతో ఆంధ్రప్రదేశ్ నవ్యాంధ్రప్రదేశ్‌గా చరిత్ర పుటల్లోకి ఎక్కుతుందన్నారు. ఇదిలా ఉండగా రైతు, విద్యార్థి, యాదవ సంఘం, బీజేపీ యువనేతగా ఎన్నో సేవలు చేస్తున్న వెంకటాద్రి యాదవ్‌కు టీటీడీ బోర్డు మెంబరుగా అవకాశం కల్పించాలని ఆయన అభిమానులు కోరుతున్నారు.

## మూడు స్పా అండ్ మసాజ్ సెంటర్లపై మెరుపు దాడులు

### ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసిన పోలీసులు ,నలుగురు బాధితులను రక్షించిన పోలీసులు

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త



తిరుపతి నగరంలోని జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఆదివారం తిరుపతి సబ్ డివిజన్ డిఎస్‌పి వెంకటనారాయణ పర్యవేక్షణలో తిరుపతి టౌన్‌లోని ఈస్ట్, అలిపిరి, ఎస్‌వియు పోలీస్‌స్టేషన్ పరిధిలో డిబిఆర్ హాస్పిటల్ రోడ్డులో వున్న స్పా అండ్ సెంటర్ పై మెరుపు దాడులు చేసి నిర్వాహకులను అరెస్టు చేసి నలుగురు బాధితులను రక్షించారు. ఈస్ట్ సిఐ డి. మహేశ్వర రెడ్డి, ఎస్ఐ నాగేంద్రబాబు, ఈస్ట్ సిబ్బంది డిబిఆర్ ఆసుపత్రి రోడ్డులోని గంగిరెడ్డి హాస్పిటల్ ఎదురుగా ఉన్న బిల్డింగ్‌లో సీ -7 సలూన్ అండ్ స్పా సెంటర్‌పై దాడులు చేయగా స్పా సెంటర్ నందు నలుగురు మహిళలు, ముగ్గురు వ్యక్తులు పక్క పక్క గదులలో వ్యభిచారం చేస్తూ పట్టుబడ్డారు. ఈ స్పా సెంటర్‌కు మేనేజర్‌గా మనీషా, సెంటర్స్ ఆర్గనై జర్స్‌గా మహి వారి భర్త అఫ్తాబ్ వ్యవహారాలను చూస్తున్నారు. సీ - 7 సెలూన్ వారిపై ఇమ్మొరల్ ట్రాఫిక్ యాక్ట్ కేసు నమోదు చేసి వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ముగిసిన శ్రీ అయ్యప్పస్వామి జీర్ణోధారణ అష్టబంధన మహా కుంభాభిషేకం

పుత్తూరురూరల్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో వెలసిన శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి జీర్ణోధారణ మహా కుంభాభిషేకం ఆదివారంతో ముగిసింది. ఈ నెల 12 నుంచి 4 రోజుల పాటు కుంభాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామివారి గోపుర విమాన కుంభాభిషేకం కార్యక్రమం అనంతరం మహా అభిషేకం అలంకరణ మహాదీపారాధన ప్రత్యేక హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి పురవీధుల్లో ఊరేగించారు.

**శ్రీహరిహర పుత్రుని దర్శించుకున్న నగరి ఎమ్మెల్యే**

పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయ ఆవరణలో వెలసిన శ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి జీర్ణోధారణ అష్టబంధన మహా కుంభాభిషేకం కార్యక్రమంలో గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమాజం వారు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి శాలువలు కప్పి ఘనంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ముగిసిన వినాయక చవితి వేడుకలు

పుత్తూరురూరల్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణం, మండల పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి మండపాలు ఏర్పాటు చేసిన వినాయక స్వాములకు ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని శిరుగురాజుపాళెం పంచాయతీ దిగువగూళూరులో వినాయకుని పురవీధిలో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం ఉట్టికొట్టే కార్యక్రమం, అన్నదానం కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం మంగళవాయిద్యాల నడుమ డప్పు వాయిద్యాలు నడుమ, యువకులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా ఉల్లాసంగా స్వామివారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివార్లను, నిమజ్జనంచేపట్టారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## అధ్వాన్నంగా వున్న కార్వేటినగరం డైట్ రోడ్డు

### ఇబ్బందుల్లో ఛాత్రోపాధ్యాయులు - రైతులు

కార్వేటినగరం, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:



కార్వేటినగరం డైట్‌రోడ్డు గత ఎనిమిదేళ్ళుగా అధ్వాన్నంగా వున్న ఇటు పాలకులు, అటు అధికారులు పట్టించుకోవడంలేదని డైట్ ఛాత్రోపాధ్యాయులు, ప్రజలు, రైతులు వాపోతున్నారు. కార్వేటినగరం కాశాతోటవీధిలో వినాయకుని ఆలయం నుంచి జిల్లావిద్యాశిక్షణాసంస్థ వరకు ఒక కిలోమీటరు పైగానే దూరం కలదు. గత 20సంవత్సరాల క్రితం డైట్ రహదారికి తారురోడ్డు వేశారు. గత ఎనిమిదేళ్ళుగా ఈ రహదారి అడుగడుగున గుంతలమయమై వుంది. ఈ రహదారిలో డైట్, తూర్పుఅరుందతివాడ, తూర్పుయానాది కాలనీ, రెడ్డిండ్లు, పొలాలు వున్నాయి. ఈ మార్గంలో నిత్యం ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు, కార్లు వెళ్తుంటాయి. పాదచారులకు సైతం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్డు బావులు, బావులుగా గుంతలై వున్నాయి. ద్విచక్రవాహనదారులు ఆదమరిస్తే ప్రమాదం సంబంవిస్తుంది. ఎనిమిది ఏళ్ళయినా ఈ రహదారిని అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నార్థకంగా వుంది. ఈ మార్గంపై ఆధారపడి వేలాది ఎకరాలు భూములు ఉన్నాయి. ఈ భూముల్లో ఏపంట పండినా ఈ మార్గం ద్వారానే గమ్యం చేరాల్సి వుంది. చెరకు, మామిడి, వరి లాంటి పంటలను గమ్యం చేర్చడానికి గుంతలమయం రోడ్లతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు వాపోతున్నారు. కాగా ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టరు స్పందించి ఈ మార్గానికి తారురోడ్డు వేసి ప్రజలు, విద్యార్థులు కష్టాలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.

## వైభవంగా ప్రదోష పూజలు

నగరి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:



పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వరాలయంలో ప్రదోష పూజలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వాములను పుష్పాలతో అలంకరించి నంది వాహనంపై ఉంచి ఆలయ ప్రదక్షిణం చేశారు. అనంతరం వాహన మండపం వద్ద భక్తుల దర్శనార్థం ఉంచగా భక్తులు స్వాములను దర్శించుకుని కర్పూర హారతులు అందుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## సి.గొల్లపల్లిలో అన్నదాన కార్యక్రమం

తిరుపతిరూరల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం సి.గొల్లపల్లి గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా ఆదివారం బాల వినాయక కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఉప మండలాధ్యక్షుడు విదుదల మాధవరెడ్డి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల వినాయక కమిటీ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రులు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. హిందువులు ఏ పవిత్ర కార్యక్రమాన్ని తలపెట్టిన ముందుగా వినాయకుణ్ణి పూజిస్తారని తెలిపారు. చేసే పనిలో ఎలాంటి ఆటంకాలు, అవాంతరాలు తలెత్తకుండా వినాయకుణ్ణి పూజిస్తారని తెలిపారు. పిల్లలలో పెద్దలలో భక్తి భావం నింపుతుందని తెలిపారు. ప్రతి ఏడాది వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.గొల్లపల్లి గ్రామ సర్పంచ్ విదుదల రవికుమార్‌రెడ్డి, బాల వినాయక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గంగమ్మ సేవలో ఎస్పీ, రైల్వేస్ డిఎస్పీలు

బోయకొండ(చౌడేపల్లి), సెప్టెంబర్ 15 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయ భద్రతపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. ఆదివారం ఆయన సతీమణి తిరుపతి రైల్వేస్ డిఎస్పీ హర్షితతో కలసి బోయకొండ గంగమ్మను దర్శించుకొన్నారు. వారిని ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి, అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం మండపంలో వేదపండితులు గోవర్ధనశర్మ, విశ్వనాథశర్మలచే వేదాశీర్వాదం, అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

**గంగమ్మ ఆలయం భద్రతకు ప్రత్యేక శ్రద్ధ**

శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయ భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటున్నామని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు వస్తున్నారన్నారు. ఇలాంటి ప్రదేశాల్లో ఇప్పటికే పలు చర్యలు తీసుకొన్నామనీ, దసరా మహోత్సవాల దృష్ట్యా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు వుంటుందన్నారు. బోయకొండ, గంగాపురం తదితర ప్రాంతాల్లో నిఘా కట్టుదిట్టం చేస్తామన్నారు. పుంగనూరు రూరల్(చౌడేపల్లి)సిఐ రాంభూపాల్, ఆలయ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కోలాహలంగా విఘ్ననాయకుడి నిమజ్జనం



చౌడేపల్లి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా గత 9రోజులుగా భక్తులచే పూజలందుకొన్న లంబోధరుడి నిమజ్జనాన్ని కోలాహలంగా నిర్వహించారు. ముఖ్యంగా పట్టణంలోని మృత్యుంజయేశ్వరుని ఆలయం, నేతాజీనగర్, పాతబస్టాండు, తదితర ప్రాంతాల్లో నెలకొల్పిన వినాయకుని విగ్రహాలను నిమజ్జనం గావించారు. స్థానిక వినాయక యువత ఆధ్వర్యంలో సాంప్రదాయ నృత్యాలు, డప్పులు, జక్కీకలు, కోలాటలు, మార్వాడీ పాటలతో యువత ఉర్రూతలూగుతూ వినాయక విగ్రహాల నిమజ్జనాలు వేడుకగా నిర్వహించారు. కాగా మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం వద్ద వినాయక యువతచే గడచిన 9రోజులూ స్వామివారి మండపం వద్ద వివిధ కార్యక్రమాలు, అన్నదాన శిబిరం ఏర్పాటు చేసారు.

# ఘనంగా విఘ్ననాధుని నిమజ్జనోత్సవాలు

పుంగనూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :



పట్టణంలో ఆదివారం వినాయకుల నిమజ్జన కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. తేరువీధి, నాగప్పాలెం, హైస్కూలువీధి, నగరివీధి, చెంగారెడ్డి వీధి, డేవిడ్‌వీధులకు చెందిన వినాయక ప్రతిమలను నిర్వాహకులు పట్టణంలో ఊరేగిస్తూ పలుచెరువులు,నీటిబావులకు తీసుకువెళ్ళారు. బళ్ళారి డ్రమ్స్‌తో పాటూ యువకుల నృత్యాలతో ప్రదర్శనలు అలరించాయి. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దాదాపు పాతిక ప్రాంతాలలో వినాయకులను నిమజ్జనానికి తరలించడంతో ఎంబిటిరోడ్డు వాహనాలతో క్రిక్కిరిసిపోయింది.

# శ్రీచెంగాళమ్మ సన్నిధిలో చాగంటి

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరిదేవిని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానానికి వచ్చిన ఆయనకు ఇఓ శ్రీనివాసబాబు చెంగాళమ్మ ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు ఆకుతోట రమేష్ స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం చాగంటి కోటేశ్వరరావు దంపతులు ఆలయంలోని పరివార దేవతలను దర్శించి పూజలు చేశారు. చెంగాళమ్మ చెట్టుకు ప్రదక్షణలు చేసి పూజలు చేశారు. అనంతరం మన్నారుపోలూరులోని చరిత్రప్రాశస్తి కలిగిన చోళరాజులు నిర్మించిన శ్రీఅలఘుమల్లారి కృష్ణస్వామి ఆలయాన్ని దర్శించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు మన్నెముద్దు పద్మజ, అయితా శ్రీధర్, కాకి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# గురువుల పట్ల భక్తి భావంతో మెలగాలి

## పోతుగుంట విజయ్‌బాబు

పుత్తూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :



ప్రతి విద్యార్థి తమ గురువుల పట్ల భక్తి భావంతో మెలగాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక ఎస్ఆర్ఎస్ జూనియర్ కాలేజీ ఆవరణలో 1983-84 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. విద్యార్థుల తమ జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను మరిచిపోకూడదని తెలిపారు. గురువులను గౌరవించడం భారతీయ సంస్కృతిలో ఒక భాగమని పేర్కొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమకు చదువు చెప్పిన గురువులు కేశవరెడ్డి, నిర్మలను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జి.ధనపాల్, అపరంజిరాజు, పరమేశ్వరమంగళం ఎంపిటిసి శ్రీజ బాలాజీనాయుడు, టిడిపి నాయకులు ఇ.రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రూ.20లక్షల గంజాయి స్వాధీనం-ముగ్గురు అరెస్టు

తొట్టంబేడు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

బుచ్చినాయుడుకండ్రిగ సర్కిల్ సిఐ తిమ్మయ్య మండలంలోని ఆలత్తూరు క్రాస్ వద్ద పోలీసుల వాహనాల తనిఖీల్లో భాగంగా అనుమానాస్పదంగా వస్తున్న వాహనాన్ని తనిఖీ చేస్తుండగా ఇందులో 23కేజీల200 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తిమ్మయ్య తెలిపారు. వీరిలో అన్నమయ్య జిల్లాకు చెందిన మహబూబ్‌బాషా, ఒరిస్సాకు చెందిన క్షత్రియ, దిలీప్‌చేతన్‌లును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని సిఐ తిమ్మయ్య తెలిపారు. సిఐ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాకు చెందిన మహబూబ్ బాషాకు ఒరిస్సాకు చెందిన క్షత్రియ, దిలీప్‌చేతన్‌లతో పరిచయం ఏర్పడిందని, దీంతో గంజాయివ్యాపారం మొదలుపెట్టారని ఈనేపథ్యంలో ఆదివారం మద్యాహ్నం ఆలత్తూరు చెక్‌పోస్టు వద్ద తనిఖీచేస్తుండగా తనిఖీల్లో భాగంగా పట్టుబట్టారని వీరిని అరెస్టుచేసి కేసునమోదు చేయడంతో పాటు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపార. సమావేశంలో తహశీల్దార్ ఐ.సుబ్రమణ్యం, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# గణనాథునికి వైభవంగా అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం







కాణిపాకం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం జరిగిన తిరుకళ్యాణం, అశ్వవాహనసేవ సందర్భంగా ఉభయదారులైన వేర్వేరు వంశస్థులచే వేర్వేరుగా స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు తిరుకళ్యాణం ఉభయదారులైన కాణిపాకం, తిరువణంపల్లె వణిగవంశస్థులు, అశ్వవాహనసేవ ఉభయదారులైన బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింత మాకులపల్లె, కారకాంపల్లె, గ్రామాధుల గోనుగుంట బలిజ వంశస్థులు వేర్వేరుగా స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకంను నిర్వహించారు. వీరు స్థానిక మణికంఠేశ్వరాలయం నుండి మంగళవాయిద్యాలు, వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ అష్టోత్తర శత కలశాలను గ్రామపురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ఆలయంలో అర్చకస్వాములు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకార మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై వుంచి ఊరేగిం పుగా తీసుకువచ్చిన అష్టోత్తర శత కలశాలలోని పాలతో అభిషేకిం చారు. అలాగే పలురకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి, అలంకరించి ప్రత్యేక పూజలు చేసి ధూపదీపనైవే ద్యాలను సమర్పించారు. ఈసందర్భంగా వేదపండితులు మంత్ర పుష్పం గావించారు. దీనితో ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలా డింది. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్ పెక్టర్‌లు విఘ్నేష్, రవి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి,ఎంపీటీసీ సుధీర్,ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

# అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





కాణిపాకం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం జరిగిన అశ్వవాహనసేవ, తిరుకళ్యాణం సందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన వివిధరకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతో అలరించాయి. ఈమేరకు స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం నుండి అర్ధరాత్రి వరకు పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన ప్రముఖ కళాకారులచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.



టీటీడీ ఈఓ శ్యామలరావుకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈఓ గురుప్రసాద్

# కాణిపాకంలో ఆదిదంపతుల బిక్షాటన



కాణిపాకం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం జరిగిన స్వామివారి తిరుకళ్యాణం సందర్భంగా ఆది దంపతులైన శివపార్వతులు కాణిపాకం పురవీధుల్లో బిక్షాటన సాగించారు. తమ కుమారుడైన గణనాధుని తిరుకళ్యాణంకు కావలసిన వస్తు సామాగ్రిని సమకూర్చుకోవడానికి తల్లిదండ్రులైన శివపార్వతులిద్దరూ కాణిపాకం పురవీధుల్లో భిక్షాటన చేయడం ఆనవాయితీ. ఈమేరకు మణికంఠేశ్వరాలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తులను వుంచి అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వినాయకుని కళ్యాణానికి కావలసిన ధన, కనక, వస్తువులను అందించాలని కోరుతూ కాణిపాకం పురవీధుల్లో భిక్షాటన సాగించారు. ఈమేరకు ఆలయ ఈఓ పట్టె గురుప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, మాజీ చైర్మన్ జగన్నాధరెడ్డి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఆలయ అధికారులు, ఉభయదారులు కాణిపాకం పురవీధుల్లో బిక్షాటన చేశారు. ఈసందర్భంగా భక్తులు తమవంతు విరాళాలను స్వామివారి కళ్యాణానికి అందించారు.

## శ్రీకళ్యాణ వెంకన్న ఆలయంలో

# శాస్త్రోకంగా పవిత్ర సమర్పణ

## యాగశాలలో వైదిక క్రతువులు నిర్వహించిన అర్చకులు

తిరుపతిరూరల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:



తుమ్మలగుంటలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ పవిత్రోత్సవాలలో భాగంగా రెండోరోజు ఆదివారం పవిత్ర సమర్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాలసేవ, సహస్ర నామార్చాన నిర్వహించారు. అనంతరం సీతాలక్ష్మణ సమేత శ్రీరాముల ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసారు. అక్కడ విశ్వక్సేనారాధన, పుణ్యాహ వచనం, కుంభారాధన,ఉక్త హోమాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన సేవను వేడుకగా నిర్వహించారు. ధ్రువమూర్తులు, కౌతుకమూర్తులు, స్నపన మూర్తులకు బలిమూర్తులకు పవిత్రాలు సమర్పించారు. అ సాయంత్రం శ్రీసీతారామలక్ష్మణులు బంగారు తిరుచ్చిపై ఆలయ మాఢ వీధులలో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి రఘునాధరెడ్డి దంపతులు, ఈవో సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 38 ఎర్రదుంగలు పట్టివేత : ముగ్గురు అరెస్టు

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త



తిరుపతి మంగళం పరిధిలో ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి, వారి నుండి 38 ఎర్రచందనం దుంగలు, ఒక కారు, రెండు మోటారు సైకిల్‌లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇంచార్జ్, తిరుపతి జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ ఎస్పి పి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐలు లింగాధర్, విశ్వనాథ్ టీమ్‌లు స్థానిక అటవీ అధికారుల సహకారంతో ఆదివారం మంగళం వైపు ఉన్న శేషాచలం అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. మంగళంలోని ఒక సూపర్ మార్కెట్ సమీపంలో కొందరు వ్యక్తులు టవేర వాహనంలో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తుండగా పోలీసులు చుట్టుముట్టారు. కొందరు తప్పించుకోగా ముగ్గురు పట్టుబడ్డారు. వారిని తమిళనాడు చెన్నైకు చెందిన ఇద్దరు ఉండగా, మరొకరు తిరువన్నామలై జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. వారి నుంచి 38 ఎర్రచందనం దుంగలు, రెండు మోటారు సైకిళ్లు, టవేరా కారును స్వాధీనం చేసుకున్నారు. వారిని, పట్టుబడిన వాహనాలు, ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. సిఐ సురేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# మాజీ మంత్రి రోజాను సన్మానించిన నేతలు

నగరి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:



మాజీ మంత్రి రోజా వైసీపీ పార్టీ అధికార ప్రతినిధిగా నియమితులు కావడం పట్ల స్థానిక పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని మాజీ మంత్రి నివాసానికి వెళ్లిన వారు ఆమెను శాలువలతో సత్కరించారు. స్వీట్లు తినిపించారు. పార్టీలో అంకితభావంతో పని చేస్తూ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉంటూ గత పదేళ్లుగా నగరి నియోజకవర్గ ప్రజలకు సేవలు చేసినందుకు పార్టీలో సముచిత స్థానం కల్పించడం పట్ల అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన బాధ్యతను తూచా తప్పకుండా నెరవేరుస్తానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, మురుగ, ఏపీ రాష్ట్ర బలిజ సేవ ప్రధాన కార్యదర్శి పి.గోపి తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత రైల్వే ఇంజనీర్లకు ఘన సన్మానం



రేణిగుంట, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:

రేణిగుంట(తిరుపతి) సీఆర్ఎస్ సీడబ్ల్యుఎం కాన్ఫరెన్స్ హాలులో ఇంజనీర్స్‌డే సందర్భంగా ఆదివారం సీఆర్ఎస్‌పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా ఏఐఆర్ఆర్ఎఫ్‌జాతీయ నాయకులు, అధ్యక్షులు శ్రీధర్, జోనల్ నాయకులు యుగంధర్ ఆధ్వర్యంలో మాజీ అధ్యక్షులు వైఎన్ శాస్త్రి జ్ఞాపకార్థం విశ్రాంత రైల్వే ఇంజనీర్లకు మోక్షగుండం విశేశ్వరయ్య ఇంజనీర్స్ అవార్డులను ప్రదానం చేశారు. ముందుగా ముఖ్య అతిథి సీఆర్ఎస్ సీడబ్ల్యుఎం దేవ సహాయం మోక్షగుండం విశేశ్వరయ్య స్మరించుకుని అందరితో కలసి ఘనంగా నివాళులర్పించారు.సీఆర్ఎస్ విశ్రాంత ఉద్యోగులైన డిప్యూటీ సీఎంఈ శ్రీనివాసులు, డబ్ల్యుఎం రామకోటయ్య, పీఈ రాజమణి, డీఎంఈ పుష్పరాజ్, ఏఎంఈ విజయకుమార్‌లను వారు చేసిన సేవలకు గుర్తింపుగా ఘనంగా సత్కరించి మోక్షగుండం విశేశ్వరయ్య అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సీ డబ్ల్యుఎం మాట్లాడుతూ మోక్షగుండం విశేశ్వరయ్య గొప్పతనాన్ని కీర్తించారు. ఒక ఇంజనీర్‌గా భారతదేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎన్నో ప్రాజెక్టుల రూపకర్తగా ఆయన కీర్తి శాశ్వతం అన్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించి భారత ప్రభుత్వం 1955వ సంవత్సరం అతి ప్రతిష్టాత్మకమైన భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించిందన్నారు. తిరుమలకు మొదటి ఘాట్ రోడ్డు రూప కల్పన చేసిన శ్రీవారి దర్శనాన్ని సులభతరం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అందరూ ఇంజనీర్లు ఆయన బాటలో పయనించి భారతదేశం కీర్తిని నలువైపులకు చాటాలన్నారు. గౌరవ అతిథులుగా సీఆర్ఎస్ డిప్యూటీ సీఈఎం రమేష్, సీనియర్ డీఎంవో హిమజా బాయి, డిప్యూటీ సీపీవో అరుణ్‌కుమార్, ఏడబ్ల్యుఏవో గోపాల్ నాయక్, ఏడబ్ల్యుఎంలు నవీన్ కుమార్, దాస్య నాయక్ విచ్చేయగా కార్యక్రమంలో పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ సురేంద్రరెడ్డి, కార్యదర్శి ఆర్ఎం విజయకుమార్, కోశాధికారి కృష్ణదాస్, కార్యవర్గ సభ్యులు, రైల్వే విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

# రాహుకేతుదోష పూజలు జరిపించుకున్న కలెక్టర్

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజ లను ఆదివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ కుటుంబ సభ్యులతో జరిపించుకున్నారు. ప్రతి రోజూ వేలాది మంది భక్తులు రాహు కేతుదోష నివారణ పూజలు జరిపించుకుం టున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాహు కాల సమయంలో కాలసర్పదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఓ ఎన్‌వియస్ఎన్‌మూర్తి స్వాగతం పలికారు. తరువాత స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయంలో దర్శనం ఏర్పాటు చేసారు. పూజల అనంతరం కలెక్టర్ వెంకటేశ్వరన్ ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఇఓ ఎన్‌వియస్ఎన్ మూర్తి, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, సిఐ డి గోపి,ఎస్ఓ నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు.

# చిట్టిబాబుకు భారత సేవా రత్న అవార్డు

పాలసముద్రం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:





ఎపి, తెలంగాణ రాష్ట్రాల రూరల్ యాక్షన్ సంస్థ ఆర్గనైజర్, ట్రాయ్ కాగ్ సభ్యులు పి.చిట్టిబాబుకు సోమరాజు ఫౌండేషన్ సంస్థ భారత సేవా రత్న జాతీయ అవార్డును అందజేసింది. బెంగళూరు జక్కు గ్రీన్ సిటీలో ఆదివారం ఫౌండేషన్ ఛైర్మన్ శివరామరాజు, కేంద్ర న్యాయ శాఖ మంత్రి సెక్రటరీ శివనాగేశ్వరరావు, కర్నాటక హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణలు ఈ అవార్డును పి.చిట్టిబాబుకు ప్రదానం చేసి సత్కరించారు. అవార్డు గ్రహీత పి.చిట్టిబాబు రెండు తెలుగు రాష్ట్రాల్లో టెలికం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం, గ్రామీణ మహిళల అభ్యున్నతికి చేతి వృత్తులపై శిక్షణ అందించడం, పేద పాఠశాల విద్యార్థులకు విద్యా సామాగ్రి అందించడం, కోవిడ్ సమయంలో గ్రామీణ ప్రాంత వాసులకు న్యూట్రీషియన్ ఫుడ్ అందజేయడం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్య సమాజ ఆవిష్కరణకు నడుం బిగించడంతో ఈ అవార్డు లభించింది. ఈ అవార్డును అందుకున్న పి.చిట్టిబాబును స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు భూపతి, రవవి, అమరనాధ్, మునికృష్ణ, సంస్థ సిబ్బంది పద్మావతి, సురేష్, తేజ, రాజకుమారి, షాలిని, హర్షకుమార్‌లు అభినందించారు.

# ఆధునిక సమాజానికి స్ఫూర్తి ప్రదాత అంబేద్కర్

## విగ్రహ ఆవిష్కరణలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

పెనుమూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:



ఆధునిక ప్రపంచానికి స్ఫూర్తి ప్రదాతగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నిలిచారని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. రిటైర్డ్ హెడ్మాస్టర్ ఎం.సుబ్రమణ్యం నేతృత్వంలో పెనుమూరు మండలం కలవగుంట ఎగువపూనేపల్లి గ్రామంలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రపంచ మేధావిగా, దళితుల ఆశాజ్యోతిగా కీర్తించబడుతున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు మనం ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమన్నారు. తాను తన పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు మంది ఎమ్మెల్యేల సహకారంతో చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానన్నారు. ఈ క్రమంలోనే పాకాల రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలో కొత్త రైల్వే కోచ్ డిపో ఏర్పాటు చేయడానికి బీజం పడిందన్నారు. గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ తన నియోజకవర్గంను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నానన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ద్వారా తనకు లభించిన అవకాశంను దళితుల అభ్యున్నతికి అంకితం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నగర కార్పొరేటర్ ఆశోక్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ యుగంధర్‌పొన్నా, అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు, ఎగువ పూనేపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నిశ్చితార్థం వేడుకలో ఎమ్మెల్యే భానుప్రకాష్, మాజీమంత్రి చెంగారెడ్డి

నగరి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:



శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ, చైర్మన్ తెలుగుదేశం నాయకుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి కుమారుడు సందీప్, నిఖితల నిశ్చితార్థం వేడుకలు జరిగింది. ఈ వేడుకలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొని దంపతులను ఆశీర్వదించి అభినందించారు. వేదులో మాజీ మంత్రి రెడ్డివారిచెంగారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.